క్లుప్తంగా

గీతాజయంతి ఉత్సవాలు ప్రారంభం


గీతా సందేశం ఇస్తున్న ఎల్వీ గంగాధరశాస్త్రి

మంచిర్యాలఅర్బన్: స్థానిక పద్మనాయక మండపంలో భగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్వీ గంగాధరశాస్త్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గీతా సందేశమిచ్చారు. డిసెంబర్ 1న భగవద్గీతపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు దివాకర్‌రావు, భగవద్గీత అధ్యయన మండలి సభ్యులు గోనె శ్యాంసుందర్‌రావు, మాదంశెట్టి సత్యనారాయణ, కె.కృష్ణ, కటకం హరీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమం తనిఖీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలోని అనాథ పిల్లల ఆశ్రమాన్ని మంగళవారం ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులు సందర్శించి, పిల్లల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు, వసతిని కల్పిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సీబ్ల్యూసీ మెంబర్ సైమన్ సుందర్, డీసీపీవో ఆనంద్, మెడికల్ ఆఫీసర్ నిఖిత, ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య, చిల్డ్రన్ హోమ్ ఇన్‌చార్జి ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ముఖేశ్ గౌడ్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్ రెడ్డి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బెల్లంకొండ మురళి మంగళవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, జయరామరావు, రవీందర్ రావు, ఆదినాథ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


పతకాలతో విద్యార్థులు

మంచిర్యాలటౌన్: నాలుగో రాష్ట్రస్థాయి ఓపెన్ కుంగు ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలను లక్సెట్టిపేటలో నిర్వహించగా, మంచిర్యాలకు చెందిన పది మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ బెల్లంపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో టీఎన్జీవోస్ నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని పశుసంవర్ధక శాఖ, జిల్లా ఖజానాశాఖ అధికారి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కార్యాలయంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులను మంగళవారం టీఎన్జీవోస్‌లో సభ్యత్వ నమోదు చేయించినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యులుగా చేరుతున్నారని, తమ సంఘం తరుపున ఉద్యోగుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, గోపాల్, రామ్ కుమార్, తిరుపతి, అజయ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (ఆర్‌యూపీపీటీఎస్) జిల్లా తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీధరస్వామిని నియమించినట్లు కె.సత్యనారాయణచారి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన తాడోజు సత్యనారాయణ విధుల నుంచి సస్పెండ్‌కు గురికావటంతో పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

నిలిచిన పనులు..తప్పని తిప్పలు..!

- అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు
- ప్రైవేటు స్థలాల్లో, రోడ్లపై వారసంతల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న చిరువ్యాపారులు, వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ భవనం

నస్పూర్: పట్టణ ప్రజలకు ప్రతీరోజు తాజా కూరగాయలు, పండ్లు, పూలు, చేపలు, మాంసాహారం లాంటి వాటిని ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. పట్టణ పరిధి రాయల్‌గార్డెన్ సమీపంలోని సుందరయ్య కాలనీలో సుమారు రూ.7కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో 2022ఫిబ్రవరిలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

వారంలో నాలుగు రోజులు వార సంతలు..

సుందరయ్యకాలనీలోని రాయల్‌గార్డెన్ వద్ద ప్రతీ మంగళ, శనివారం, శ్రీరాంపూర్ ఎస్‌బీహెచ్ వద్ద ఖాళీ స్థలంలో ప్రతీ సోమవారం, ఆర్కే 6 గని సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఖాళీ స్థలంలో ప్రతీ శుక్రవారం వారసంతలు జరుగుతుంటాయి. ఈ సంత నిర్వహించే స్థలాలు ప్రైవేటు స్థలాలు కావడం, స్థలం సరిపోక చిరువ్యాపారులు తమ వ్యాపారాలను రోడ్లపై కొనసాగిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని ఇబ్బందులు...

వారసంతల వద్ద ఎలాంటి సులభ్ కాంప్లెక్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో

బెల్లంపల్లి(తాండూర్): చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించడానికి కృషి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించడానికి, మరుగున పడిపోతున్న క్రీడలను కాపాడాలనే ఉద్దేశంతో క్రీడా పోటీలు ఏర్పాటు చేసిందన్నారు. మండల స్థాయిలో పోటీలు నిర్వహించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆకర్శితులు కావడానికి అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని, మానసికొల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలన్నారు. దైనందిన జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.అంజయ్య, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, ఎంపీవో అనిల్‌కుమార్, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, కాంగ్రెస్ నాయకులు సూరం దామోదర్ రెడ్డి, ఈసా, శంకర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

చెన్నూర్: హోం గార్డులకు సీఎం రేవంత్ రెడ్డి నెలకు రూ.30వేలు, మరణిస్తే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినందుకు పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి హోంగార్డులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హోంగార్డులు తిరుపతి రెడ్డి, స్వప్న, సదాశివ్, ముదాసీర్, నాగరాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనం పరిశీలిస్తున్న డీటీ ప్రకాష్

నెన్నెల: ఇటీవల రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మండలంలో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఫుడ్ కమిటీ కన్వీనర్ డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ చిత్తాపూర్ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మండలంలో ఏడుగురిని ఫుడ్ సేఫ్టీ కమిటీ కన్వీనర్లుగా నిర్ణయించారు. వారానికి ఒకసారి వీరు ఆశ్రమ, కస్తూరిబా హాస్టళ్లను తనిఖీ చేయనున్నారు.

భీమిని: మండలంలోని కేజీబీవీని తహసీల్దార్ బికర్నాదాస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఎంపీడీఓ గంగామోహన్ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

డాక్టర్ ఆనందంకు కామధేను అవార్డు



అవార్డు అందుకుంటున్న గంట ఆనందం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ గంట ఆనందంకు మంగళవారం విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ సీఈవో సత్యవేలు రాంబాబు కామధేను అవార్డును అందించారు. 35రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డు ఇవ్వగా, ఆయుర్వేదం కేటగిరిలో కామధేను అవార్డును హైకోర్టు జడ్జి సూరెపల్లి నందా చేతుల మీదుగా తనకు అందించినట్లు డాక్టర్ ఆనందం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పైలేరియా పరీక్షలు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: అనుమానితులు పైలేరియా (బోధకాలు) నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో మంగళవారం బోధకాలు నిర్ధారణ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండ్రోజులపాటు బోధకా లు నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 పీహెచ్‌సీల పరిధిలో 5,400 రక్త నమూనా లు సేకరించేందుకు 108 టీంలను ఏర్పాటు చేసిన ట్లు చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ అమన్, నాందేవ్, జగదీశ్, శ్రీనివాస్, దీక్షితారాణి, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

హాజీపూర్ పీహెచ్‌సీ ఎదుట ఆశల నిరసన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆశ కార్యకర్తల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం హాజీపూర్ పీహెచ్‌సీ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి అల్లి సునిత, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, రజిత, పద్మ, శ్యామల, మంగ, శాంతిసుధ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

జన్నారం: మండలంలో పలువురు ఆశ కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. చలో హైదరాబాద్-అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ఆందోళనలు చేసే అవకాశం ఉన్నందునా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందస్తుగా ఆశవర్కర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు తొగరి లీల, మండల ఉపాధ్యక్షురాలు మంజులతో పాటు శైలజ, కవిత, కళావతిలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను నిజమైన కళాకారులుగా గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశం కల్పించి తగిన ఉపాధితో ఆదుకోవాలని తెలంగాణ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలో ఈ నెల 12, 13తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే హలో కళాకారుడా-ఛలో హైదరాబాద్ కార్యక్రమ ప్రచార పోస్టర్లను మంగళవారం హాజీపూర్ మండల నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల నుంచి చపరాడకు డిసెంబర్ 29న నిర్వహించే దత్తావతార కార్తీక్ మహరాజ్ 22వ పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కార్తీక్ మహరాజ్ పాదయాత్ర నిర్వాహకకమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

రక్తదాన శిబిరం

జైపూర్: రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని వేలాలలో గుదూరి వసంత జ్ఞాపకార్థం సుంచిళ్ల మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసి న కార్యక్రమంలో స్థానిక యువకులు రక్తదానం చేశారు.

వంద శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలి

లక్సెట్టిపేట: పదో తరగతి విద్యార్థుల వందశాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏసీఎంవో రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి

నస్పూర్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీ డిక్లరేషన్‌లో భాగంగా తాము అధికారంలోకి వస్తే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను సీసీసీ కార్నర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం సమర్పించారు.

బొగ్గుబాయి వార్తలు

వృత్తి కోర్సులతో ఉపాధి


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సేవా అధ్యక్షురాలు మాలతి

శ్రీరాంపూర్: సింగరేణి అందిస్తున్న పలు వృత్తి శిక్షణ కోర్సులతో మహిళలకు ఉపాధి లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు ఎల్. మాలతి తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. 2000సంవత్సరంలో సింగరేణి సేవాసమితి ఆవిర్భవించిందన్నారు. దీని ద్వారా వేలాది మంది యువతి, యువకులకు పలు వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మోటార్ డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్, వోల్వో డ్రైవింగ్, హెవీ డ్రైవింగ్ టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ వంటి అనేక వృత్తి కోర్సుల్లో శిక్షణ అందించామన్నారు. గత ఆర్థిక సంవత్సరం వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ఆమె చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం బ్యూటిషన్, టైలరింగ్ నూతన కోర్సులు ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, నాయకులు కిషన్‌రావు, సేవా సభ్యులు శిరీష, రజిత, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కంపెనీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఏరియాలోని దివ్యాంగులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా సేవా అధ్యక్షురాలు మాలతి హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, క్రీడా గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్, నాయకులు కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం


రామకృష్ణాపూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చెన్నూర్: తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని నిరసిస్తూ స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర సాధనలో ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి ఆమె ఆత్మ గోషించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిందని, యావత్తు తెలంగాణ ప్రజలు దీనిని ఖండిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీలు బాపు, తిరుపతి, మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్లు రేవెల్లి మహేష్, తుమ్మ రమేష్, బీఆర్ఎస్ నాయకులు కొప్పుల రవీందర్, ఆరీఫ్, నాయబ్, సురేష్ రెడ్డి, బోగె భారతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: స్థానిక సూపర్‌బజార్ సెంటర్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. బతుకమ్మను తొలగించటం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమేనని, పాత విగ్రహాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పోగుల మల్ల య్య, ఓదెలు, జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా మరో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బెల్లంపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సకు స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చెన్నూర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సురేష్ చిదురా తెలిపారు. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూర్ మున్సిపాలిటీ కేంద్రంలో నేటి వరకు 10వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 300కు పైగా కంటి ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. శిబిరానికి చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాల నుంచి 350మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో కంటి శస్త్ర చికిత్స కోసం 200మంది ఎంపికయ్యారని, మొదటి విడతగా 40మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ చైర్మన్ డాక్టర్ భాస్కర్, మధుకర్, లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ఎడ్ల శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్, చెన్నూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, కార్యదర్శి వెంకట నర్సయ్య, కోశాధికారి నిమ్మల సాగర్, క్యాంప్ చైర్‌పర్సన్ రత్న భాస్కర్ రెడ్డి, మంచాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంబవి ఐ విజన్ సెంటర్‌లో మంగళవారం సింగరేణి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 56మందికి కంటి వైద్య నిపుణుడు, సింగరేణి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొంకటి.అంజయ్య కంటి పరీక్షలు చేశారు. 9మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించగా, మరో 4గురిని శస్త్ర చికిత్స చేయడానికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో సింగరేణి లయన్స్ క్లబ్ కార్యదర్శి వంగల చక్రపాణి, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు పెద్దిరాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలి


కేకే-5 గనిపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగి సంస్థ ఆదేశాల మేరకు నిబద్ధతతో పనిచేయాలని ఏరియా జీఎం దేవేందర్ ఉద్యోగులకు సూచించారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జీఎం మాట్లాడారు. సింగరేణి సంస్థ ఎదుర్కొంటున్న స్థితిగతులపై ఉద్యోగులకు వివరించారు. ప్రతీ ఉద్యోగి తనకు కేటాయించిన పనిని రక్షణతో నిర్వహించాలని, సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యసాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు, గని అధికారులు, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

ఆర్కే 7 గనిలో రక్షణ పక్షోత్సవాలు


బహుమతి అందిస్తున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ఉత్పత్తి సాధనలో రక్షణ మరవరాదని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. ఆర్కే 7 గనిలో మంగళవారం రక్షణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిని సందర్శించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగులతో రక్షణ పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించి అనంతరం మాట్లాడారు. విధి నిర్వహణలో రక్షణ పరికరాలను ధరించి రక్షణ సూత్రాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ ప్రకారం పనిచేస్తే ప్రమాదాలు జరగని సూచించారు. కార్యక్రమంలో రక్షణ తనిఖీ కమిటీ కన్వీనర్ జీఎం హబీబ్ హుస్సేన్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీలో రోగుల సౌకర్యార్థం రెండు అంబులెన్స్‌లను నూతనంగా ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ అంబులెన్సులను ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కంపెనీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైసీఎంఓ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కాసిపేట: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్, జీఎం(ఐఅండ్‌పీఎం) బి.శ్రీనివాసరావు తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 1ఇంక్‌లైన్ గనిని రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రక్షణ కమిటీ తనిఖీ చేసింది. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. అనంతరం 54వ వార్షిక రక్షణ వారోత్సవాల్లో గెలుపొందిన సేఫ్టీ కమిటీ ఫెర్ఫార్మెన్స్, బెస్ట్ ఎన్విరాల్‌మెంట్ మైన్ బహుమతులను ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, కేకే గ్రూప్ ఏజెంట్ వి.రామదాసు, డీవైజీఎం శ్రీనివాస్, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని మేనేజర్ భూశంకరయ్య, బృందం సభ్యులు, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అటవీశాఖకు భూములు అప్పగించడం నిలిపివేయాలి

కాసిపేట: ఏజెన్సీ గ్రామపంచాయతీ మద్దిమాడలో సాగు చేస్తున్న భూములను ఎలాంటి అనుమతులు, పీసా గ్రామసభలు లేకుండా అటవీశాఖకు అప్పగిస్తున్న భూములను నిలిపివేయాలని ఆదివాసీల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: షాదీఖానా భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై ప్రభుత్వ ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అమానుల్లాఖాన్, కాంగ్రెస్ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ.గౌస్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మాట్లాడారు. కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విషయంలో ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.